సాక్షి యాదాద్రి భువనగిరి

గురువారం । 12 । జనవరి । 2023



భయం గుప్పిట్లో చదువులు

ఆలేరులో ప్రభుత్వ జూనియర్ కళాశాల శిథిలావస్థకు చేరింది.విద్యార్థులు బిక్కు బిక్కుమంటూ కాలంవెళ్లదీస్తున్నారు. - 9లో



ముగిసిన అంత్యక్రియలు

దైవ దర్శనానికి వెళ్లి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆరుగురికి బుధవారం అంత్యక్రియలు ముగిశాయి. - 10లో

గరిష్టం/కనిష్టం
30.0°/14°

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఆహ్లాదంగా, రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కల్తీ పాల గుర్తింపు.. ముగ్గురిపై కేసు నమోదు



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు, చిత్రంలో కల్తీ పాల తయారీ సామగ్రి

బీబీనగర్ : కల్తీ పాల తయారీని గుర్తించేందుకు బీబీనగర్, కొండమడుగు, పరిసర ప్రాంతాల్లో అధికారులు బుధవారం తెల్లవారుజామున విస్తృతంగా తనిఖీలు చేశారు. పాలను తరలిస్తున్న ఆటోలు, వాహనాలో నమూనాలు సేకరించి మొబైల్ ల్యాబ్‌లో పరీక్షలు చేశారు. కొండమడుగు, బీబీనగర్‌కు చెందిన ముగ్గురు కల్తీ పాలు తయారు చేస్తున్నట్లు గుర్తించారు. వారి నుంచి పాల తయారీ సామగ్రి, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేయించారు. పాలను కల్తీ చేసినా, కృత్రిమంగా తయారు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఉమ్మడి జిల్లా ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి హెచ్చరించారు. ఆమె వెంట జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి స్వాతి, ఎస్ఐ సైదులు ఉన్నారు,

గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలి



మాట్లాడుతున్న ఎండీ జహంగీర్

గుండాల : గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం గుండాల మండలం కేంద్రంలో నిర్వహించిన పార్టీ మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.బీజేపీ యేతర రాష్ట్రాల్లో గవర్నర్లు కేంద్ర ప్రభుత్వ ఏజెంట్లుగా వ్యవహరిస్తూ పాలనకు ఆటంకం కలిగిస్తున్నారని ఆరోపించారు. విధానపరంగా గవర్నర్ వ్యవస్థకు సీపీఎం వ్యతిరేకం అన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాటూరి బాలరాజు, సీపీఎం మండల కార్యదర్శి మద్దెపురం రాజు, మాజీ ఉప సర్పంచ్ పోతరబోయిన అంజయ్య, ఎండీ ఖలీల్, బత్తిని భిక్షం ఎం.బాలయ్య, లింగయ్య పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహం తరలించారంటూ ధర్నా



చెరువులో నిరసన తెలుపుతున్న హిందూ వాహిని, ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ నాయకులు

భువనగిరి : పట్టణంలోని పెద్దచెరువులో ఉన్న ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఇరిగేషన్ అధికారులు తరలించారని ఆరోపిస్తూ బుధవారం హిందువాహిని, ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ ఆధ్వర్యంలో రోడ్డుపై ధర్నా, చెరువులోకి దిగి నిరసన తెలిపారు. విగ్రహాన్ని తిరిగి యథాస్థానంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సీఐ సత్యనారాయణ వారికి నచ్చజెప్పి ధర్నా విరమింపజేశారు. అనంతరం చెరువులో నిరసన కొనసాగించారు. విగ్రహాన్ని తాతానగర్‌లోని ఓ గుడి వద్ద నుంచి తిరిగి చెరువు కట్ట వద్దకు తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మాయ దశరథ, నాయకులు పడమటి జగన్మోహన్‌రెడ్డి, సామ రవీందర్, నాగరాజు, రమేష్, ఉమాశంకర్ రావు, భరత్, కౌన్సిలర్ రత్నపురం బలరాం, ఊదరి సతీష్, సుర్వి శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న గూడూరు నారాయణరెడ్డి

భువనగిరి : క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని బీజేపీ రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణరెడ్డి అన్నారు. బుధవారం భువనగిరిలోని ఇండోర్ స్టేడియం వద్ద యువ హిందూ వాహిని ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువతలో ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడా పోటీలు మంచి అవకాశం అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సర్వోత్తంరెడ్డి, పడమటి జగన్‌మోహన్‌రెడ్డి, హిందువా హిని నాయకులు కదారి శివ, రత్నపురం ప్రవీణ్, తోట రవి, కిరణ్ పాల్గొన్నారు.

తందూరి చాయ్..

భువనగిరిలో కొత్తగా తందూరి చాయ్ పాయింట్ వెలిసింది. మట్టితో తయారు చేసిన కప్‌లో టీ ఇవ్వటం ఇక్కడ ప్రత్యేకత. మట్టి కప్‌లో వెచ్చదనంతో పాటు ఆరోగ్యానికి మేలు చేస్తుందన్న విశ్వాసంతో తందూరి చాయ్ తాగేందుకు పట్టణవాసులు మక్కువ చూపుతున్నారు. ప్రస్తుతం చలి తీవ్రత పెరిగిన నేపథ్యంలో చాయ్‌కు విపరీతంగా డిమాండ్ ఉంది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, యాదాద్రి భువనగిరి



పంచ నారసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి క్షేత్రలో బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు నిత్యారాధనలు విశేషంగా చేపట్టారు. వేకువజామున ప్రధానాలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం స్వయంభూలకు బిందే తీర్థం ఆరాధన చేశారు. శ్రీస్వామి వారికి బాలభోగం చేపట్టిన తర్వాత మూలవర్యులకు నిజాభిషేకం నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించారు. సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన గావించారు. ఇక ఆలయంలో సుదర్శన నారసింహహోమం, బ్రహ్మోత్సవం, నిత్యకల్యాణం, తిరువీధి జోడు సేవలు నిర్వహించారు. రాత్రి పవళింపు సేవ చేసి ఆలయాన్ని మూసివేశారు. నిత్య కల్యాణం, వేద ఆశీర్వచనం, సుదర్శన హోమంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.



కిడ్నీ బాధితుల కష్టాలకు చెక్

విస్తృతమవుతున్న వైద్య సేవలు

- ఇప్పటికే ఆలేరు, చౌటుప్పల్‌లో అందుబాటులోకి
- జిల్లా కేంద్ర ఆస్పత్రిలో సంక్రాంతి తర్వాత
- రోగులకు తగ్గనున్న వ్యయప్రయాసలు



దయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయనున్న జిల్లా కేంద్ర ఆస్పత్రి



సాక్షి, యాదాద్రి : కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. వారి ప్రాణాలకు భరోసానిస్తుంది. డయాలసిస్ సేవలు పొందాలంటే గతంలో జిల్లా వాసులు హైదరాబాద్, నల్లగొండ తదితర సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. తద్వారా రోగులు ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చేవారు. క్రమేణా ఆ ఇబ్బందులు తొలగిపోతున్నాయి. జిల్లాలో నానాటికీ పెరుగుతున్న కిడ్నీ బాధితులకు జిల్లాలోని ఆస్పత్రుల్లోనే సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటుంది. అందులో భాగంగా ఇప్పటికే ఆలేరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాల్లో సేవలు అందుతున్నారు. భువనగిరిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రిలోనూ సంక్రాంతి తర్వాత ఏర్పాటు కానుంది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. డయాలసిస్ కేంద్రాల కోసం ఆయా ప్రాంతాల ఎమ్మెల్యేలు తీవ్రంగా కృషి చేశారు.

ఆలేరులో..

ఆలేరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో 2020 జూన్ 28వ తేదీ స్థానిక ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి చొరవతో జైన్ తీర్థ్ కొలనుపాక వారి సహకారంతో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం సుమారు 72 మందికి డయాలసిస్ సేవలు అందుతున్నాయి. మరో 13మంది కోసం ఇంకా నాలుగు డయాలసిస్ యూనిట్లను ఎమ్మెల్యే ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలోనే మొదటి డయాలసిస్ కేంద్రం కావడంతో మేడ్చల్ మల్కాజిగిరి, జనగామ జిల్లాలతో పాటు, భువనగిరి, బీబీనగర్, రామన్నపేట, చౌటుప్పల్ నుంచి ఆలేరు ఆస్పత్రికి వచ్చి రోగులు సేవలు పొందుతున్నారు. ప్రస్తుతం అందుతున్న సేవలను మరింత విస్తరిస్తున్నారు.

చౌటుప్పల్‌లో..

చౌటుప్పల్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌ను ఈనెల 3వ తేదీన రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. ఐదు పడకల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో రోగులకు సేవలు అందుతున్నాయి. ఈ ప్రాంతంలో సహజంగానే కిడ్నీ బాధితులు ఎక్కువ. వారిలో చాలా వరకు ఇప్పుడు చౌటుప్పల్ సెంటర్‌లో సేవలు పొందుతున్నారు.

భువనగిరిలో సన్నాహాలు

భువనగిరిలోని జిల్లా కేంద్రా ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఐదునుంచి 10 పడకలు, అధునాతన యంత్రాలతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. సంక్రాంతి తర్వాత మంత్రి హరీష్‌రావు చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. ఇక్కడ డయాలసిస్ కేంద్రం అందుబాటులోకి వస్తే నిరుపేదలకు ఎంతో ఉపయోగపడనుంది.

ఉచితంగా విలువైన వైద్యం

కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడే వారు గతంలో డయాలసిస్ చేయించుకోవడానికి హైదరాబాద్, నల్లగొండ ఆస్పత్రులకు వెళ్లేవారు. ప్రభుత్వం ఆరోగ్యశ్రీలో డయాలసిస్‌ను చేర్చినప్పటికీ సుదూరప్రాంతాలకు వెళ్లాలంటే బాధితులపై ఆర్థికంగా భారం పడేది. అంతేకాకుండా అనారోగ్యంతో అంత దూరం వెళ్లాలంటే వ్యవయప్రయాసలకోర్చేవారు. ప్రభుత్వం జిల్లా ఆస్పత్రుల్లోనే ఉచితంగా డయాలసిస్ సేవలను విస్తృతపరుస్తుండడంతో రోగులకు ఇబ్బందులు తీరనున్నాయి. ప్రధానంగా నిరుపేదలకు ఎంతో ప్రయోజనం కలగనుంది.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



జిల్లా కేంద్ర ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. సంక్రాంతి తర్వాత మంత్రి హరీష్‌రావు చేతుల మీదుగా ప్రారంభించనున్నాం. భువనగిరి ప్రాంత వాసులకు ఎంతో ఉపయోగపడుతుంది. డయాలసిస్ కేంద్రం మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

–పైళ్ల శేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యే, భువనగిరి

ఏర్పాట్లు పూర్తి కావొచ్చాయి



భువనగిరిలో డయాలసిస్ కేంద్రం పనులు పూర్తికావొచ్చాయి. యంత్రాలు కూడా వచ్చాయి. త్వరలోనే యూనిట్ ప్రారంభం కానుంది. దీంతో పాటు ఇప్పటికే ఆలేరు, చౌటుప్పల్ ఆస్పత్రుల్లో డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేశాం. కిడ్నీ బాధితులకు రోజూ సేవలందిస్తున్నాం.

–డాక్టర్ చిన్నానాయక్, జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్

పాలనలో ప్రత్యేకత

- భువనగిరి సబ్ కలెక్టర్‌గా పనిచేసిన శాంతికుమారి
- ఐఏఎస్ అధికారిగా మొదటి పోస్టింగ్ భువనగిరిలోనే
- పది నెలల పాలనలో పలు మార్పులు
- డివిజన్‌లో అక్షరాస్యత పెంపునకు కృషి
- సీఎస్‌గా బాధ్యతలు చేపట్టడంపై ఇక్కడి ప్రజల హర్షం



1993 జనవరి 31న కొలనుపాకలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న శాంతికుమారి (కుడి చివర)



శాంతికుమారి

సాక్షి, యాదాద్రి : ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్)గా బాధ్యతలు చేపట్టిన శాంతికుమారి గతంలో భువనగిరి సబ్ కలెక్టర్‌గా పనిచేశారు. ఐఏఎస్ అధికారిగా ఆమె మొదటగా భువనగిరి సబ్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. 1992 ఆగస్టు 25 నుంచి 1993 జూన్ 14 వరకు భువనగిరి డివిజన్‌లో విధులు నిర్వహించారు. సమస్య ఉన్నచోటుకు వెళ్లి పరిష్కరించే అధికారిగా ఆమెకు ప్రజల్లో మంచి గుర్తింపు ఉంది. భువనగిరిలో ప్రభుత్వ భూమిని కబ్జా చెర నుంచి విడిపించారు. ప్రస్తుతం ఆ స్థలాన్ని టీఎన్‌జీవో భవనానికి కేటాయించారు. వలిగొండ మండలంలోని ఎం.తుర్కపల్లి గ్రామంలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూసమస్యను అప్పట్లో క్షేత్ర స్థాయికి వెళ్లి పరిష్కరించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాతోపాటు భువనగిరి డివిజన్‌లో పీపుల్స్‌వార్ నక్సలైట్ల ప్రభావం ఎక్కువగా ఉన్న సమయంలో.. సబ్ కలెక్టర్‌గా శాంతికుమారి ప్రభుత్వ కార్యక్రమాలను ముమ్మరంగా కొనసాగించారు. ప్రధానంగా చదువు–వెలుగు కార్యక్రమం భువనగిరి డివిజన్‌లో విజయవంతం కావడం కోసం రాత్రి పూట గ్రామాలను తిరిగి నిరక్షరాస్యులైన మహిళలకు చదువు చెప్పించారు. అలాగే యువజన, సేవా, వైద్య శిబిరాలకు విస్తతంగా హాజరయ్యేవారు. సుమారు 10 నెలల కాలంలో శాంతికుమారి సబ్ కలెక్టర్‌గా అందించిన సేవలు భువనగిరిలో ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు. ఉత్తమ సేవలు అందించిన అధికారి ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ సీఎస్‌గా నియమితులు కావడంతో యాదాద్రి జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిర్వాసితులను పట్టించుకోవడం లేదు



దీక్షకు సంఘీభావం తెలుపుతున్న నాయకులు

భువనగిరి : బస్వాపూర్ నిర్వాసితులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు డిమాండ్ చేశారు. బస్వాపూర్ రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న బీఎన్ తిమ్మాపురం గ్రామస్తులు చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 44వ రోజుకు చేరాయి. దీక్షలకు ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. నిర్వాసితులకు న్యాయం చేయవల్సిన ప్రభుత్వం బాధ్యతారాహితంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. 250 గజాల చొప్పున స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణం కోసం రూ.10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు ఇరిగేషన్ శాఖ, యాదాద్రి క్షేత్రంలో ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. దీక్షలో పల్లెర్ల అంజయ్య, అన్నంపట్ల కృష్ణ, రాజేష్, సర్పంచ్ పిన్నం లత, ఎంపీటీసీ ఉడత శారద, యాదగిరి, కిషన్, చంద్రయ్య ఉన్నారు.



టీజీఓ డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు, ఉద్యోగ సంఘాల నాయకులు

అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకం

- కలెక్టర్ పమేలా సత్పతి
- ఉద్యోగ సంఘాల క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

సాక్షి, యాదాద్రి : జిల్లా అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకమని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో టీజీఓ, టీఎన్‌జీఓ, వివిధ ఉద్యోగ సంఘాల డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను ప్రజల ముంగిటకు చేర్చడంలో అధికారులు, ఉద్యోగుల సహకారం మరువలేనిదన్నారు. ప్రజల సమస్యలు సత్వరం పరిష్కరించడం ద్వారా ఎంతో తృప్తి మిగులుతుందన్నారు. సర్వే ల్యాండ్ రికార్డును వంద శాతం జిల్లాకు తెప్పించి ప్రత్యేకంగా రికార్డు రూంను ఏర్పాటు చేసుకున్నట్లుచెప్పారు. 600 స్వచ్ఛంద సంస్థలు, దాతల నుంచి రూ.4.80 కోట్ల విరాళాలు అందడంతో పాఠశాలల్లో ఎన్నో వసతులు సమకూరాయన్నారు. అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, ఎంవీ భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. పల్లె, పట్టణ ప్రగతి, హరితహారం వంటి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడం వెనుక అధికారులు, ఉద్యోగుల కృషి ఎంతో ఉందన్నారు. జిల్లా అభివృద్ధిలో ఉద్యోగుల పని తీరు అభినందనీయమన్నారు. ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ అందరి సహకారంతో జిల్లా ప్రగతిపథంలో సాగుతుందన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ముందుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు జగన్, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డీఆర్‌డీఓ మందడి ఉపేందర్‌రెడ్డి, వ్యవసాయాధికారి అనురాధ, ట్రెసా అధ్యక్షుడు భగత్, సెక్రటరీ నాగేశ్వరాచారి, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నోట్ బుక్స్ పంపిణీ

భువనగిరిటౌన్ : పట్టణంలోని బీసీ సంక్షేమ బాలికల వసతి గృహాన్ని బుధవారం కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ సదర్శించారు. విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకోసం నిరంతరం కృషి చేయాలన్నారు. ఉన్నత స్థాయికి చేరుకుని తల్లిదండ్రులకు, పుట్టిన ఊరికి, జిల్లాకు పేరు తేవాలని ఆకాంక్షించారు. వారి వెంట బీసీ సంక్షేమ అధికారి యాదయ్య, జిల్లా వ్యవసాయ అధికారిణి అనురాధ ఉన్నారు.

కాటేపల్లి ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన కలెక్టర్



పాఠశాల ఆవరణను పరిశీలిస్తున్న కలెక్టర్

మోటకొండూర్ : మండలంలోని కాటేపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. బుధవారం విద్యాబోధన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. అలాగే మన ఊరు– మన బడి పనులను పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పిల్లలతో పాటలు పాడించారు. కార్యక్రమంలో డీఈఓ నారాయణరెడ్డి, సర్పంచ్ మంత్రి రాజు, కార్యదర్శి నందాల సాయికుమార్, ఉపాధ్యాయులు మంజుల, ఎల్యాస్ పాల్గొన్నారు.

మద్యం మాఫియాకు రాజకీయ అండ!

- నకిలీ మద్యం దొరికినా చర్యలు అంతంతే
- లైసెన్స్ తాత్కాలిక సస్పెన్షన్, నౌకర్ నామాలపైనే కేసులు
- అసలైన లైసెన్స్‌దారులకు నోటీసులతో సరి
- లైసెన్స్ రద్దు కాకుండా ఒక్కో షాప్ నుంచి భారీగా ముడుపుల బేరం
- రేపో మాపో షాపులపై సస్పెన్షన్ ఎత్తివేతకు రంగం సిద్ధం



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: మద్యం మాఫియాకు రాజకీయం తోడైంది. నకిలీ మద్యం వ్యవహారంలో పైరవీలు జోరందుకున్నాయి. ఓ కీలక నేత సాయంతో కేసును నీరుగార్చే ప్రయత్నాలు మొదలయ్యాయి. నకిలీ మద్యం వ్యవహారంలో యాదాద్రి జిల్లాలో వైన్స్ లైసెన్స్‌ను రద్దు చేసిన అధికారులు నల్లగొండ జిల్లాలో మాత్రం ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. కేవలం లైసెన్స్‌ను సస్పెండ్ చేసి, నౌకర్ నామా, పనిచేసే వారిపై కేసులు నమోదు చేశారు. అసలైన లైసెన్స్‌దారులకు నోటీసులు జారీ చేసి వదిలేశారు. దీంతో వారు అప్పీల్‌కు వెళ్లారు. ఇప్పుడు ఆయా వైన్స్ లెసెన్స్ రద్దు కాకుండా తీవ్ర స్థాయిలో ఒత్తిడి పెంచారు. జిల్లాకు చెందిన ఓ నాయకుడు ఇందులో అన్నీ తానై వ్యవహరిస్తున్నట్లు తెలిసింది.

ఒకచోట ఒకలా.. మరోచోట ఇంకోలా

ఒడిశా–ఆంధ్రా బోర్డర్‌లో అనుమతి లేకుండానే డిస్టిలరీని ఏర్పాటు చేసిన నకిలీ మద్యం తయారు చేసి రాష్ట్రంలోని రంగారెడ్డి, నల్లగొండ, యాదాద్రి జిల్లాలకు నకిలీ మద్యం సరఫరా చేసినట్లు గత నెలలో ఎక్సైజ్ శాఖ గుర్తించింది. మునుగోడు ఎన్నికల సమయంలోనూ ఇదే మద్యాన్ని పెద్ద ఎత్తున విక్రయించినట్లు తెలిసింది. ముఖ్యంగా చౌటుప్పల్ మండలం దేవలమ్మనాగారంలో ఓ ఇంట్లో రూ.30 లక్షల విలువైన తెలంగాణ లేబుల్స్ కలిగిన నకిలీ మద్యాన్ని పట్టుకున్నారు. ఈ వ్యవహారంలో కీలకమైన బాలరాజుగౌడ్‌పై కేసు నమోదు చేశారు. మరోవైపు సంస్థాన్ నారాయణపూర్ మండలంలో ఆయనకు సంబంధించిన వైన్స్‌లో తనిఖీలు చేశారు. అందులో నకిలీ మద్యం దొరక్కపోయినా, నకిలీ మద్యం కేసులో ఆయన కీలక సూత్రధారి కావడంతో ఆ షాపు లైసెన్స్‌ను రద్దు చేశారు. మర్రిగూడ మండలంలోనూ ఓ బెల్ట్ షాపులో నకిలీ మద్యం పట్టుపడింది. అక్కడి వైన్స్‌లో పనిచేసే నౌకర్‌నామా ఇంట్లో 23 కాటన్‌లను పట్టుకున్నారు. అతని ద్వారానే ఈ మద్యం సరఫరా అయినట్లు గుర్తించారు. హాలియా మున్సిపాలిటీ పరిధిలోని ఓ బత్తాయి తోటలో అక్రమంగా నిల్వ చేసిన 42 కాటన్ల (ఐబీ క్వాటర్లు) మద్యాన్ని పట్టుకున్నారు. గుర్రంపోడులో వైన్స్‌లో పనిచేసే వ్యక్తి దగ్గర 11 కాటన్లు పట్టుకున్నారు. ఇలా నకిలీ మద్యం జిల్లాలో వైన్స్ షాపుల నౌకర్‌నామాలు, పనిచేసే వారి ద్వారానే ఏరులైపారింది. దీంతో వారిపై కేసులు నమోదు చేసి, వైన్స్ లైసెన్స్‌లను సస్పెండ్ చేశారే తప్ప రద్దు చేయలేదు.

నౌకర్‌నామా తప్పు చేస్తే లైసెన్స్‌దారుడు చేసినట్లే..

ఎక్సైజ్ శాఖ నిబంధనల ప్రకారం లైసెన్స్ పొందిన వ్యక్తి తన వైన్స్‌కు సంబంధించిన పూర్తి బాధ్యతలను నౌకర్‌నామాకు అప్పగిస్తారు. అంటే యజమాని స్థానంలో అతను ఉంటారు. నౌకర్‌నామా ఏ తప్పు చేసినా లైసెన్స్‌దారుడు చేసినట్లే. ఈ లెక్కన జిల్లాలో, మునుగోడు ఎన్నికల్లో నకిలీ మద్యం ఏరులై పారేందుకు నౌకర్‌నామాలే కారణం. నకిలీ మద్యం వారి ద్వారానే బెల్ట్‌షాపులకు చేరినట్లు, ఆయా షాపుల వద్దకు కూడా నకిలీ మద్యం తెచ్చినట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో లైసెన్స్‌దారులపైనా చర్యలు చేపట్టాల్సి ఉన్నా నౌకర్‌నామాలపై కేసులు నమోదు చేసి, లైసెన్స్‌లను సస్పెండ్‌చేసి వదిలేశారు. లైసెన్స్‌దారులకు కేవలం నోటీసులు ఇచ్చారు. ఈ వ్యవహారంలో ఎక్సైజ్ అధికారుల తీరుపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కావాలనే అలా వ్యవహరించారన్న చర్చ జోరుగా సాగుతోంది.

భారీగా ముడుపుల బేరం?

లైసెన్స్‌ల సస్పెన్షన్‌ను ఎత్తివేసేందుకు జోరుగా పైరవీలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున ముడుపులు చేతులు మారేందుకు రంగం సిద్ధమైనట్లు సమాచారం. రేపో మాపో సస్పెన్షన్‌ను ఎత్తివేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇందుకోసం ఒక్కో షాప్ నుంచి భారీగా ముడుపులు చేతులు మారేలా స్కెచ్ వేసినట్లు తెలిసింది. జిల్లాలోని ఓ ముఖ్యమైన రాజకీయ నాయకుడు ఇందులో జోక్యం చేసుకున్నట్లు సమాచారం. ఆయనే దగ్గరుండి సస్పెన్షన్ ఎత్తివేయించేందుకు పెద్ద ఎత్తున పైరవీ చేస్తున్నట్లు తెలిసింది. ఎక్సైజ్ కమిషనరేట్ నుంచే ఈ వ్యవహారం నడుపుతున్నట్లు వైన్స్ యజమానుల్లో చర్చ జోరుగా సాగుతోంది. అదే జరిగితే సస్పెన్షన్ రద్దు కానుంది. దీంతో మళ్లీ మందుబాబులకు నకిలీ మద్యం బెడద తప్పేలా లేదు. ఈ విషయమై ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, సూపరింటెండ్ సంతోష్‌రెడ్డిని వివరణ కోరగా.. నకిలీ మద్యం కేసులో కేసులు రిజిస్టర్ చేసి లైసెన్స్‌లు సస్పెండ్ చేశామని తెలిపారు. నౌకర్‌నామాలు తప్పు చేయడంతో లైసెన్స్‌దారుల వివరణ తీసుకుని కమిషనర్‌కు పంపించామని చెప్పారు. లైసెన్స్‌దారులు కమిషనర్‌కు అప్పీల్ పెట్టుకున్నారని.. విచారణ అనంతరం చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

వివేకానందుడి బాటలో..

పలువురు యువకులు స్వామి వివేకానందుడి బాటలో పయనిస్తున్నారు. యువజన సంఘాలు ఏర్పాటు చేసి సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆపదలో ఉన్నవారికి మేమున్నామంటూ అండగా నిలబడుతున్నారు. రాజకీయాల్లోనూ రాణిస్తూ మన్ననలు పొందుతున్నారు.

- వివరాలు 8లో ▸



ప్రజలను చైతన్యపరుస్తున్న మహేష్‌రెడ్డి



పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న మహేష్‌రెడ్డి

నడిగూడెం : చిన్న నాటి నుంచి ప్రజలకు సేవ చేయాలనే తపన ఆ యువకుడిది. గ్రామంలో చాలామంది మద్యానికి బానిసై ఏ పనీ చేయకుండా ఆర్థికంగా చితికిపోవడాన్ని గమనించాడు. అలాంటి వారిని చైతన్య పర్చాలనే లక్ష్యంతో కరివిరాల గ్రామానికి చెందిన యువకుడు గార్లపాటి మహేష్‌రెడ్డి గణేష్ యువజన సంఘాన్ని స్థాపించాడు. గ్రామంలో సారాను అరికట్టాలనే ఉద్దేశంతో అనేక చైతన్య కార్యక్రమాలను చేపట్టాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఓ సంస్థలో ఉద్యోగిగా పని చేస్తున్నాడు. తన వేతనం నుంచి ప్రతి నెలా రెండు వేల రూపాయలతో పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్నాడు. ఏటా విద్యార్థులు క్రీడాకారులకు దుస్తులు అందజేస్తూ గ్రామంలో యువకులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఆయన సేవలను గుర్తిస్తూ.. ఇటీవల హైదరాబాద్‌లో మనం ఫౌండేషన్, ఆదర్శ కళానిలయం ఆధ్వర్యంలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ప్రస్తుత నీటిపారుదల శాఖ చైర్మన్ వేణుగోపాలచారి చేతుల మీదుగా అవార్డు, పొందారు. ఇంకా పలువురు ప్రముఖుల చేతుల మీదుగా ఒక సామాజిక కార్యకర్తగా ప్రశంస పత్రాలు అందుకున్నారు.

సమాజ మార్పు కోసం కృషి చేస్తున్నా

మా గ్రామంలో గతంలో సారా ఏరులై పారేది. దీంతో అనేక మంది మృత్యువాత పడ్డారు. సారాను అరికట్టాలని ఆనాడు తోటి స్నేహితులతో కలిసి యువజన సంఘం ఏర్పాటు చేశాను. గ్రామంలో సారా నివారణ, అక్షరాస్యత, పేదలకు నిత్యావసర సరుకులు, విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ తదితర కార్యక్రమాలను స్వచ్ఛందంగా చేపట్టాను. – గార్లపాటి మహేష్‌రెడ్డి, కరివిరాల

వివేకానందుడి బాటలో..

- సేవా కార్యక్రమాల్లో ముందుంటున్న యువత
- యువజన సంఘాలు ఏర్పాటు చేసుకుని సమాజ సేవ
- ఆపద సమయంలో మేమున్నామంటూ భరోసా
- రాజకీయాల్లోనూ రాణిస్తున్న యూత్

నేడు జాతీయ యువజన దినోత్సవం



'మందలో ఉండకు.. వందలో ఉండు. ప్రయత్నం చేసి ఓడిపో. కానీ, ప్రయత్నం చేయడంలో మాత్రం ఓడిపోకు' అని చెప్పిన స్వామి వివేకానందుడి సూక్తులను పలువురు ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుకు సాగుతున్నారు.
నేడు నేషనల్ యూత్ డే సందర్భంగా ప్రత్యేక కథనాలు.

ఎంపీపీగా ప్రజాసేవలో సుమతి



పేర్ల సుమతి,
అనుముల ఎంపీపీ

హాలియా : చిన్న వయస్సులో ప్రజలకు ప్రజాసేవ చేసే అదృష్టం దక్కింది అనుముల మండలం మదారిగూడెం గ్రామానికి చెందిన సుమతికి. స్థానిక సంస్థల ఎన్నికల్లో మదారిగూడెం ఎంపీటీసీ స్థానం ఎస్సీ మహిళకు రిజర్వు కావడంతో అక్కడి నుంచి సుమతి పోటీ చేసి గెలుపొంది.. 25 ఏళ్లకే అనుముల ఎంపీపీ పీఠాన్ని దక్కించుకున్నారు. ఎంఏ, బీఈడీ పూర్తి చేసిన ఈమె అనుముల మండల ప్రజలకు విశేష సేవలందిస్తూ పలువురి మన్నలు పొందుతున్నారు. ఒకపక్క మండల అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతూనే.. మరోపక్క ప్రభుత్వ ఉద్యోగ సాధనే లక్ష్యంగా పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు.

అభినవ.. ఆపన్నహస్తం..!



ఆర్థికసాయం అందజేస్తున్న అభినవ యూత్ సభ్యులు

భూదాన్‌పోచంపల్లి : ఆపద సమయంలో ప్రజలకు తామున్నామని భరోసానిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు అభినవ యూత్ అసోషియేషన్ సభ్యులు. పోచంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు సొంతూరికి సేవ చేయాలనే లక్ష్యంతో నాలుగేళ్ల క్రితం అభినవ యూత్ అసోషియేషన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. గ్రామాభివృద్ధిలో పాలు తమవంతుగా పాలుపంచుకొంటూ సామాజిక సేవలో ముందుంటున్నారు.

సేవా కార్యక్రమాలు ఇలా..

- కరోనా సమయంలో పేద లకు బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు.
- గుండె సంబంధ వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి చికిత్స కోసం రూ.50 వేలు అందించారు.
- నిరుపేద చేనేత కార్మికులు చనిపోతే అనాథలైన ఇద్దరు చిన్నారుల పేరిట రూ.25 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు.
- ప్రమాదంలో మృతి చెందిన పాండు కుమార్తెల పేరిట రూ.65,176 డిపాజిట్ చేశారు.
- ఆత్మహత్య చేసుకొన్న శ్రీరాములు కుటుంబానికి రూ.13,615, బియ్యం అందజేశారు.
- రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పోచంపల్లి ఎస్ఐ మధుసూధన్ జ్ఞాపకార్థం గత వేసవిలో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.
- ఊపిరితిత్తుల సమస్యతో జన్మించిన బాలిక చికిత్స నిమిత్తం రూ.37,300 అందజేశారు.
- ఏటా వివేకానంద జయంతిని పురస్కరించుకొని విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలు, 2కె రన్ నిర్వహించి బహుమతులు అందజేస్తున్నారు.
- మట్టి గణపతులను పంపిణీ చేస్తూ ప్రజలను చైతన్యం చేస్తున్నారు.

'బీటెక్' సర్పంచ్



గ్రామసభలో మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి



మహేందర్‌రెడ్డి
ఎన్నారం సర్పంచ్

రామన్నపేట : రామన్నపేట మండలం ఎన్నారం గ్రామానికి చెందిన మెట్టు మహేందర్‌రెడ్డి 2019 ఎన్నికల్లో సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. సర్పంచ్‌గా ఎన్నికయ్యేనాటికి అతని వయసు 21 సంవత్సరాల పదకొండు రోజులు. అప్పటికి అతను బీటెక్(సివిల్) ఫైనలియర్ చదువుతున్నాడు. సర్పంచ్‌గా ఎన్నికైన మూడునెలలకు ఫైనల్ ఇయర్ పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించాడు. తండ్రి శ్రీనివాస్‌రెడ్డి ప్రోత్సాహంతో రాజకీయ అరంగ్రేటం చేసిన మహేందర్‌రెడ్డి సర్పంచ్‌గా గ్రామాభివృద్ధిపై దృష్టి సారించాడు. ఇంటింటికీ మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ ఇప్పించారు. సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నారు. గ్రామాభివృద్ధికి పాటుపడుతూ సర్పంచ్‌గా ఎన్నికైన నాటి నుంచే తన పనితీరుతో గ్రామస్తుల ప్రేమానురాగాలు పొందుతున్నాడు.

క్రీడలకు ప్రోత్సాహం



నేతాజీ యువజన మండలి భవనం

ఆత్మకూరు(ఎం) : ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో స్థానిక యువకులు 1981లో నేతాజీ యువజన మండలిని ఏర్పాటు చేసుకున్నారు. 150 మందితో ప్రారంభమైన ఈ మండలి ప్రస్తుతం 400 మంది సభ్యులకు చేరింది. నేతాజీ యువజన మండలి క్రీడారంగాన్ని ప్రోత్సహిస్తోంది. వివిధ స్థాయిల్లో క్రీడా పోటీలు నిర్వహించింది. ఈ యువజన మండలికి సంబంధించి సుమారు 80 మంది పోలీసులు, ఆర్మీ, వ్యాయామ ఉపాధ్యాయులుగా ఉద్యోగాలను పొందారు. ఉచిత కుట్టు, కంప్యూటర్ శిక్షణ తదితర సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు చేపడుతోంది. ఇటీవల పోలీసు ఉద్యోగార్థుల కోసం ఉచిత ఈవెంట్ శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. మండల కేంద్రంలో సుమారు రూ.5 లక్షలతో నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పలు సేవా కార్యక్రమాలను చేపడుతున్న నేతాజీ యువజన మండలికి ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా మంచి గుర్తింపు ఉంది.

ఆపదలో మేమున్నామంటూ

హుజూర్‌నగర్ : ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న పలువురు ఒక సొసైటీగా ఏర్పాడి ఆపదలో ఉన్నవారికి మేమున్నామంటూ అండగా నిలుస్తున్నారు. హుజూర్‌నగర్‌కు చెందిన సులువ శ్రీను, మట్టపల్లి రవీందర్, ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, జాకీర్ హుస్సేన్, కృష్ణ, లక్ష్మణ్, శ్రీనివాస్, చందు, యువరాజ్, మజీద్, వెంకన్న అంజయ్య కలిసి 2017 అక్టోబర్ 30న ఓపెన్ ఐస్ సొసైటీని ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఈ సొసైటీ 100మంది సభ్యులతో కొనసాగుతోంది.

ఓపెన్ ఐస్ సొసైటీ కార్యక్రమాలు ఇలా..



మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

- పట్టణానికి చెందిన వారి మిత్రుడు బైక్ మెకానిక్ బి వెంకన్న మరణించడంతో సొసైటీ ద్వారా అతని కుటుంబానికి రూ.3.10 లక్షలు ఆర్థిక సాయం అందజేశారు.
- కరోనాతో చనిపోయిన మరో మిత్రుడు మధు కుటుంబానికి రూ.1 లక్ష అందించారు.
- 75 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేశారు.
- పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేయడమే కాకుండా.. ప్రతిభ చూపినవారికి నగదు పురస్కారాలను అందజేశారు.
- శీతాకాలంలో వృద్ధులకు, పేదవారికి, ఒంటరి మహిళలకు దుప్పట్లు, స్వెటర్లను పంపిణీ చేస్తూ అండగా నిలబడుతున్నారు.

నందికొండ చైర్‌పర్సన్‌గా రాణిస్తున్న అనూషారెడ్డి



కర్ణ అనూషారెడ్డి, నందికొండ మున్సిపాలిటీ చైర్ పర్సన్

నాగార్జునసాగర్ : పిన్న వయస్సులోనే మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా రాణిస్తున్నారు. కర్న అనూషారెడ్డి నూతనంగా ఏర్పాటైన నందికొండ మున్సిపాలిటీకి తొలి చైర్‌పర్సన్‌గా ఆమె ఎన్నికయ్యారు. 25 ఏళ్ల వయస్సులోనే నందికొండ తొలిపౌరురాలు అయిన అనూష బౌద్ధం పరిఢవిల్లే అంతర్జాతీయ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లో అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నారు. అంతర్గత రోడ్లు, బస్టాండు ఆధునీకరణ, డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు, సమీకృత మార్కెట్ నిర్మాణం, వార్డులో 60 ఫీట్ల రోడ్డు సెంట్రల్ లైటింగ్ తదితర అభివృద్ధి పనులు చేపట్టారు. 60 ఏండ్లుగా నివాసముంటున్న ప్రభుత్వ క్వార్టర్లను వారికే ఇప్పించేందుకు కృషిచేస్తున్నారు. నార్కట్‌పల్లి మండలంలోని కొండపాకగూడెం గ్రామానికి చెందిన అనూష డిగ్రీ బీఎస్సీ పూర్తి చేసింది. పెద్దవూర మండలం తమ్మడపల్లికి చెందిన కర్న శరత్‌రెడ్డిని ప్రేమ వివాహం చేసుకుంది. వివాహమైన నాటి నుంచి నాగార్జునసాగర్‌లోనే నివాసముంటున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో 12వ వార్డు నుంచి కౌన్సిలర్‌గా గెలుపొంది చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. నందికొండ ప్రజలు కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేస్తున్నారు.

ఆదర్శం 'యువ టీం'



కరోనా సమయంలో నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేస్తున్న యువ టీం సభ్యులు

భువనగిరి : సామాజిక సేవా దృక్పథంతో ఏకమైన యువజనులు సంఘంగా ఏర్పడి సేవా కార్యక్రమాలతో ఆపన్నులకు భరోసానిస్తున్నారు. 2009 జనవరిలో భువనగిరికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సూదగాని రాజు 100 మంది యువకులతో యువటీం ఏర్పాటు చేశారు. అప్పటినుంచి విరాళాలు సేకరించి ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.

సేవా కార్యక్రమాలు ఇలా..

- 22 మంది పేద విద్యార్థులకు రూ.2.50 లక్షలు స్కూల్ ఫీజు చెల్లించారు.
- 1000 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ పంపిణీ చేశారు.
- ఐదేళ్లుగా ఇద్దరి పేద విద్యార్థులను దత్తత తీసుకుని రూ.30 వేల చొప్పున స్కాలర్‌షిప్ ఇస్తున్నారు.
- భువనగిరిలో 250 మంది పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు.
- మూడుసార్లు రక్తదానం శిబిరాలు ఏర్పాటు చేసి సుమారు 400 యూనిట్లు రక్తం సేకరించి రెడ్ క్రాస్‌కు అందజేశారు.
- కరోనా సమయంలో 200 పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు, శానిటైజర్లు పంపిణీ చేశారు.
- విద్యార్థులకు ఏటా రూ.6 లక్షల విలువైన నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్నారు.
- పట్టణంలోని బ్రహ్మణవాడ పాఠశాలకు రూ.40 వేలతో మరమ్మతు చేయించారు.
- పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలకు రూ.2 లక్షల విలువ చేసే 58 డెస్క్ బెంచీలను అందజేశారు.

సేవే యువ టీం లక్ష్యం



తమ వంతు బాధ్యతగా సామాజిక సేవా కార్యక్రమాలు చేసేందుకు యువ టీం అనే యువజన సంఘాన్ని ఏర్పాటు చేశా. ఇప్పటి వరకు ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించాం. ఎవరైనా ఎలాంటి బాధలో ఉన్న మాకు సమాచారం అందితే అవసరాన్ని బట్టి అదుకుంటాం. సేవే లక్ష్యంగా మునుముందు ఇంకా ఎన్నో కార్యక్రమాలు నిర్వస్తాం. – సూదగాని రాజు, కన్వీనర్

ఆర్టీసీ సిబ్బంది నిజాయితీ



మోత్కూరులో యువకుడికి పర్సు అందజేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

మోత్కూరు : బస్సులో ఓ ప్రయాణికుడు పోగొట్టుకున్న పర్సు తిరిగి అప్పగించి ఆర్టీసీ సిబ్బంది నిజాయితీ చాటుకున్నారు. ఈ ఘటన మోత్కూరు బస్టాండ్‌లో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్-2 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో వల్లందాస్ పవన్ కళ్యాణ్ చందుపట్లలో ఎక్కి మోత్కూరులో దిగి పోయారు. కొద్ది సేపటి తర్వాత తన పర్సు పోయిన విషయం గమనించి మోత్కూరు బస్టాండ్‌లో కంట్రోలర్ అనంతుల శ్రీనివాస్ గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన ఆయన సదరు బస్సు కండక్టర్‌కు ఫోన్ చేయగా స్పందించిన కండక్టర్ బస్సులో వెతకగా పర్సు దొరికింది. అందులో రూ.8,500 నగదు, ఏటీఎం కార్డులు, ఇతర విలువైన పేపర్లు ఉన్నాయి. పర్సును సదరు యువకుడికి మోత్కూరు ఆర్టీసీ బస్టాండ్‌లో అందించారు. కాగా, హైదరాబాద్-2 ఆర్టీసీ డిపో కండక్టర్ పి.శోభ, డ్రైవర్ యాకాంబరంలతో పాటు కంట్రోలర్ శ్రీనివాస్ గౌడ్‌కు బాధిత యువకుడు పవన్ కళ్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ విప్ గొంగిడి సునీత ఆస్తులపై హైకోర్టులో పిటిషన్

తుర్కపల్లి : అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వ విప్ గొంగిడి సునీత తన ఆస్తుల వివరాలు తప్పుగా చూపారని తుర్కపల్లి మండలం గొల్లెగూడేనికి చెందిన బోడుసు మహేశ్ ఈనెల 6న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. ఈ కేసు విచారణ చేపట్టిన హైకోర్టు పూర్తి వివరాలతో కూడిన అఫిడవిట్‌ను దాఖలు చేయాలని పిటిషనర్‌ను ఆదేశించింది. ఈమేరకు విచారణను నాలుగు వారాలు వాయిదా వేసింది. ఈ విషయంలో మంగళవారం మహేశ్ మాట్లాడుతూ రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన గొంగిడి సునీత కోట్లాది రూపాయలు వెనకేసుకున్నారని ఆరోపించారు.

అడ్డగూడూరు వాసికి డాక్టరేట్

అడ్డగూడూరు : మండల కేంద్రానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ ఎకనామిక్స్ ఎడ్ల ప్రదీప్ ఆర్థిక శాస్త్రం విభాగంలో మంగళవారం గౌరవ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం అడ్డగూడూరు మండల కేంద్రంలో మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీ ఆర్థిక శాస్త్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రోల్ ఆఫ్ ఎన్‌జీఓస్ ఇన్ వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ ఏ కేస్ స్టడీ ఆఫ్ రంగారెడ్డి డిస్ట్రిక్ అంశంపై పరిశోధన చేసినందుకుగాను ఈ డాక్టరేట్ వచ్చినట్లు తెలిపారు.

ఇసుక లారీల పట్టివేత

చౌటుప్పల్ : నిబంధనలకు విరుద్ధంగా ఓవర్ లోడ్‌తో వెళ్తున్న ఇసుక లారీలను బుధవారం పోలీసులు పట్టుకున్నారు. చౌటుప్పల్ మండల పరిధిలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద సీఐ మల్లిఖార్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా భద్రాచలం నుంచి హైదరాబాద్‌కు ఓవర్ లోడ్‌తో వెళ్తున్న ఎనిమిది లారీలను గుర్తించారు. ఈమేరకు కేసును మైనింగ్ శాఖకు అప్పగించారు.

నిబంధనలతో ప్రమాదాలకు అడ్డుకట్ట

- చౌటుప్పల్ ఏసీపీ నూకల ఉదయ్‌రెడ్డి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏసీపీ ఉదయ్‌రెడ్డి, సీఐలు

చౌటుప్పల్ : రోడ్డు భద్రతా నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేయవచ్చని చౌటుప్పల్ ఏసీపీ నూకల ఉదయ్‌రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద జీఎమ్మార్ వరలక్ష్మీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలను బుధవారం ఆయన ప్రారంభించారు. రోడ్డు భద్రతపై రూపొందించిన పోస్టర్లు, కరపత్రాలు, స్టిక్కర్లను ఆవిష్కరించారు. వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులతో పాటు ప్రజలంతా రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాల నడుపవద్దని, హెల్మెట్, సీట్ బెల్టు ధరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాతరాజు సత్యం, సీఐలు ఎరమాద మల్లికార్జున్‌రెడ్డి, విజయ్‌మోహన్, విజయ్‌కుమార్, హైవే అథారిటీ ప్రతినిధి విజయ్‌సాంగ, జీఎమ్మార్ ప్రతినిధులు శ్రీకాంత్, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భానుప్రసాద్, సంతోష్, రాజేందర్, వాహనదారులు, జీఎమ్మార్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాసరచనలో ఎంజీ యూనివర్సిటీకి ద్వితీయ బహుమతి

ఎంజీయూ, (నల్లగొండ రూరల్) : జీ- 20 సదస్సుకు మన దేశం నాయకత్వం వహిస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు 3 దశల్లో నిర్వహించిన పోటీల్లో మహాత్మాగాంధీ యూనివర్సిటీకి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి లభించింది. రాజ్‌భవన్ వేదికగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలు బుధవారం ముగిసాయి. వ్యాసరచన, వకృత్వం, లోగో తయారీ, మూడు అంశాలు, నాలుగు భాషల్లో జరిగిన ఈ పోటీలకు యూనివర్సిటీ నుంచి 10మంది డిగ్రీ, పీజీ విద్యార్థులు హాజరయ్యారు. ఈ పోటీల్లో ప్రభుత్వ బీఈడీ కళాశాల విద్యార్థిని ఆయేషాతబస్సుమ్ ఆంగ్ల విభాగంలో రాష్ట్రస్థాయి రెండో బహుమతి సాధించింది. ఈమేరకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ బహుమతి అందజేసి అభినందించారు. ఉత్తమ ప్రతిభను చూపిన విద్యార్థులను వీసీ గోపాల్‌రెడ్డి, రిజిస్ట్రార్ కృష్ణారావు, మధు తదితరులు అభినందించారు.

జాతీయ స్థాయి ఇన్‌స్పైర్‌కు ఎంపిక

- నల్లగొండ జిల్లా నుంచి మూడు.. భువనగిరి నుంచి ఒకటి



నల్లగొండ జిల్లా సైన్స్ అధికారి లక్ష్మీపతికి ప్రశంసాపత్రం అందజేస్తున్న మంత్రి



డిండి : ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థిని సాన్విత, ప్రధానోపాధ్యాయుడు

నల్లగొండ : నిర్మల్ జిల్లాలో బుధవారం జరిగిన రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో నల్లగొండ జిల్లా నుంచి మూడు, భువనగిరి నుంచి ఒక ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపికయ్యాయి. ఈ సందర్భంగా జిల్లా ప్రాజెక్టు నిర్వాహకులను రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి సన్మానించి, బహుమతులు అందజేశారు. నల్లగొండ జిల్లా నుంచి 3 ప్రాజెక్టులు జాతీయ స్థాయికి ఎంపికైనందుకు ఆ జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతిని మంత్రి సన్మానించారు. ఈమేరకు సైన్స్ అధికారి వనం లక్ష్మీపతితో పాటు గైడ్ టీచర్లకు నల్లగొండ జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లం భిక్షపతి అభినందనలు తెలిపారు.

పాము కాటు నుంచి రైతులను రక్షించే పరికరం

కనగల్ మండలం జి చిన్నారం గ్రామ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి చింతల నవీన్ పాము కాటు నుంచి రైతులను రక్షించే పరికరం (హ్యాండ్ స్టిక్ వి ప్రొటెక్టింగ్ ఫార్మర్స్ ఫ్రమ్ స్నేక్ బైట్) ప్రాజెక్టును రూపొందించాడు. దీనికి గైడ్ టీచర్ వినోద్ కుమార్.

టీచర్ లెర్నింగ్ మెటీరియల్

బీఈడీ విభాగంలో నల్లగొండలోని చర్లపల్లిలో గల డీవీఎం కళాశాలకు చెందిన అస్మిన్ కౌసర్ రాజేశ్వరి, గైడ్ టీచర్ బొడ్డుపల్లి రామకృష్ణ ఆధ్వర్యంలో టీచర్ లెర్నింగ్ మెటీరియల్ ప్రాజెక్టును ప్రదర్శించారు.

కూలింగ్ సీలింగ్ ఫ్యాన్ ప్రాజెక్టు

డిండి : డిండి మండల పరిధిలోని కందుకూరు గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని సాన్విత, గైడ్ టీచర్ శ్రీనివాస్‌లు కూలింగ్ సీలింగ్ ఫ్యాన్ ప్రాజెక్టు రూపొందించారు.

ప్రాజెక్టు నిర్మాణం

సీలింగ్ ఫ్యాన్ పైభాగాన ట్రీగార్డ్‌తో తయారు చేసిన ఫ్రేమ్ ఉంచాలి. దీనిపైపైన రెండు స్పాంజ్‌లతోపాటు వాటి మధ్యన ఇన్‌కమింగ్ వాటర్ కనెక్షన్ కలిగిన రెండు డ్రిప్ పైపులు అమర్చాలి. అదే విధంగా స్పాంజ్‌లు తడిసిన తర్వాత వచ్చే వేస్టేజ్ వాటర్ కిందకు వెళ్లడానికి మరోపైపు అమర్చాలి. నీటి కనెక్షన్ సప్లయ్ ఇవ్వడంతో స్పాంజ్‌లు తడిసిన తర్వాత సీలింగ్ ఫ్యాన్ స్విచ్ ద్వారా ఆన్ చేయాలి. దీంతో సీలింగ్ ఫ్యాన్ ఉన్న గది అంతా చల్లగా మారుతోంది.

ఇటుకలు లెక్కించే ప్రాజెక్ట్

భువనగిరి : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎగ్జిబిట్ జాతీయస్థాయికి ఎంపికైంది. నిర్మల్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలో భువనగిరి విద్యార్థి ప్రదర్శించిన ఎగ్జిబిట్ ఉంది. 7వ తరగతి చదువుతున్న మాటూరి విఘ్నేష్ ఇటుకలు లెక్కించే ప్రాజెక్ట్ రూపొందించాడు. ఈ పరికరంతో తప్పులు లేకుండా, సమయం వృథా కాకుండా లెక్కించవచ్చని నిరూపించాడు. విద్యార్థి అతనికి గైడ్‌గా ఉన్న ఉపాధ్యాయుడు భీమిశెట్టి శ్రీనివాస్, విశాఖ వేణుధర్‌రెడ్డిని కలెక్టర్, అదనపు కలెక్టర్, డీఈఓ అభినందించారు.



ప్రాజెక్టుతో విద్యార్థి విఘ్నేష్

నడిగూడెం విద్యార్థినికి ద్వితీయ బహుమతి



బహుమతి అందుకుంటున్న విద్యార్థిని ధరణి

నడిగూడెం : నిర్మల్ జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో జూనియర్స్ గణితం విభాగంలో వలయాకారం ఉన్న ద్వినితీయ ఆకారాలను త్రిమితీయ ఆకారంలోకి మార్చడం అనే అంశం నడిగూడెంలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థి ధరణి ద్వితీయ బహుమతి సాధించింది. ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి విద్యార్థిని ధరణి, గైడ్‌లు శైలజ, చైతన్యలకు బహుమతి అందజేశారు. వీరిని డీఈఓ సలీం షరీఫ్, ప్రధానోపాధ్యాయురాలు కనకతార అభినందించారు.

యాదాద్రీశుడి ఆలయం మహా అద్భుతం



ఐజేయూ అధ్యక్షుడు వినోద్ కోహ్లీ, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్‌కు ఆశీర్వచనం చేస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రీశుడి ఆలయం మహా అద్భుతమని ఐజేయూ అధ్యక్షుడు, పీసీఐ సభ్యుడు వినోద్ కోహ్లీ, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతిసాగర్, ఐజేయూ జాతీయ ఉపాధ్యక్షుడు సయ్యద్ ఇస్మాయిల్ అన్నారు. యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని 18 రాష్ట్రాల ఐజేయూ ప్రతినిధులతో పాటు రాష్ట్ర టీయూడబ్ల్యూజే నాయకుల బృందం బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రూ.2వేల కోట్లతో యాదాద్రి ఆలయాన్ని అద్భుతంగా నిర్మాణం చేశారన్నారు. దేశ, విదేశాల నుంచి ఈ క్షేత్రానికి భక్తులు అధికంగా వస్తున్నారని పేర్కొన్నారు. యాదాద్రీశుడిని దర్శించుకున్న వారిలో ఐజేయూ ఉపాధ్యక్షుడు నారాయణ్ పంచాల్, కార్యదర్శి రాజమౌళిచారి, కార్యవర్గ సభ్యులు భాస్కర్, నవీన్‌శర్మ, డాక్టర్ జోగిందర్ సింఘ్, సంజయ్ హింద్వాన్, థామస్ తదితరులున్నారు.